




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 23 సెప్టెంబర్ 2025 పేజీలు 8


### సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా

# చర్యలు తీసుకున్నాం

**అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత**



వివరాలు 2లో...



అమ్మని దర్శించుకున్న డిప్యూటీ సీఎం, మంత్రి నాదెండ్ల 2

# క్యూఆర్ కోడ్‌తో...

## సమస్యలను తెలుసుకుంటున్నాం

యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరిస్తున్నాం

ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగం విధులు నిర్వర్తిస్తోంది

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్:** భక్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం కోసం ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను... సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు అయిన సోమవారం ఆయన వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్ ద్వారా నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పసి పిల్లలకు పాల లభ్యత, మంచినీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించారు. 15 నిమిషాలలో తాను నడక దారిన చిన రాజగోపురం చేరుకున్నానన్నారు. సాధారణ భక్తుల సంతృప్తికర దర్శనం కోసం జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని మిగతా 2లో...

# విజయవాడ ఉత్సవ్‌తో మరింత గుర్తింపు

**రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడి..**

**ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి హెలికాప్టర్ రైడ్ ప్రారంభించిన మంత్రి**



**విజయవాడ మేజర్ న్యూస్ :** సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో చేపట్టిన "విజయవాడ ఉత్సవ్"తో రాజధాని అమరావతికి మరింత గుర్తింపు తీసుకురానుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ వేడుకల సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు, పర్యాటకులకు వినోదం, ఆకర్షణ కలిగించేలా విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో హెలికాప్టర్ రైడ్ ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తో కలిసి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, యువ నాయకులు కేశినేని వెంకట్, గద్దె క్రాంతి, బొండా సిద్ధార్థ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దసరా ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం విజయవాడ ఉత్సవ్‌లను తిలకించి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సహకారంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌ను చరిత్రలో నిలిచిపోయేలాగా మిగతా 2లో



### విజయవాడ - ఏలూరు జాతీయ రహదారి పక్కన

# చెత్తాచెదారాలను వెంటనే తొలగించాలి

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



**కృష్ణాజిల్లా మేజర్ న్యూస్ :** విజయవాడ– ఏలూరు జాతీయ రహదారి ప్రక్కన చెత్తాచెదారాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈనెల 24వ తేదీన భారత ఉపరాష్ట్రపతి జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ముందస్తు భద్రత ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ గన్నవరం మండలంలోని కేసరపల్లి గ్రామంలో విజయవాడు -ఏలూరు జాతీయ రహదారి నంబర్ 16 మార్గంలో ఏబి కన్వెన్షన్ హాల్ ప్రక్కన వర్షపు నీరు నిల్వ ఉండి, చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని ఏబి కన్వెన్షన్ యాజమాన్యం వారు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి మార్గంలో ఇలా చెత్తాచెదారాలు పేరుకుని దుర్గంధం వెదజల్లడం సరైనది కాదని స్పష్టం చేస్తూ వెంటనే ఆ చెత్తాచెదారాలను అక్కడి నుండి తొలగించే ఏర్పాట్లు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రత్యేకంగా మురుగునీటి వ్యవస్థను తాత్కాలికంగా పైపులైన్ల ద్వారా మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)



## అమ్మని దర్శించుకున్న డిప్యూటీ సీఎం, మంత్రి నాదెండ్ల

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై అంగరంగ వైభవంగా సాగుతున్న దసరా మహోత్సవాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామ చంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. శరన్నవరాత్రుల్లో మొదటి రోజైన సోమవారం బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదా లను అందజేశారు. పవన్ కళ్యాణ్ రాకతో ఆలయ ప్రాంగణం లో సందడి చోటుచేసుకుంది.

## సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం

### అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో ఈ ఏడాది భక్తుల సంఖ్య 20 లక్షల వరకు ఉండవచ్చని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన జగన్మాతను ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్లో మాట్లాడుతూ సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శన భాగ్యం కలిగించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా దాదాపు 4500 మంది పోలీస్ సిబ్బంది భక్తుల భద్రత కోసం పనిచేస్తున్నారన్నారు. దేవాలయ కార్య నిర్వహణ అధికారి వీకే శీనా నాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## విజయవాడ ఉత్సవ్‌తో మరింత గుర్తింపు



నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి సందర్భంగా విజయవాడకు విచ్చేసే భక్తులకు, సందర్శకులకు ఒక ప్రత్యేక అనుభూతి కలిగించడానికి హెలికాప్టర్ రైడ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కృష్ణమ్మ పరవళ్ళు, ఇంద్రకీలాద్రి పర్వతం, నగర అందాలు ఆకాశం నుంచి వీక్షించే అరుదైన అవకాశం ఇది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వినోదం కలుగడమే కాకుండా, పర్యాటక రంగానికి విశేష ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. కొత్త ప్రయోగాలు, వినూత్న ఆలోచనలు విజయవాడ ప్రతిష్టను జాతీయ స్థాయికి చేర్చుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. విజయవాడ ఉత్సవ్ లో భాగంగా భవిష్యత్తులో కూడా పర్యాటక అభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు విజయవాడను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తామని ఎంపీ శివనాథ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల గొట్టుముక్కల రఘురామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి చరణ్ యాదవ్, టిడిపి నాయకులు యెర్నేని వేదవ్యాస్, ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు నాగుర్, తెలుగుయువత నాయకులు వడ్లమూడి వంశీ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ - ఏలూరు జాతీయ రహదారి పక్కన చెత్తాచెదారాలను వెంటనే తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా తొలగించే ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. శాశ్వతంగా వర్షపు నీరు నిల్వ ఉండకుండా మురికి కాలువలో కలిపేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జాతీయ రహదారి మార్గంలో పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని కలెక్టర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, డిపిఓ డాక్టర్ జె అరుణ, గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, పంచాయతీరాజ్ ఎస్.ఈ. రమణ రావు, జాతీయ రహదారి ఈఈ నాగేశ్వరరావు, గన్నవరం తహసిల్దార్ శివయ్య, ఎంపీ డీవో స్వర్ణలత, కేసరపల్లి గ్రామపంచాయతీ ఈవో ప్రసాదు పాల్గొన్నారు.



# క్యూఆర్ కోడ్‌తో... సమస్యలను తెలుసుకుంటున్నాం







(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభమైన దర్శనం మధ్యాహ్నానికి 20,000 మంది పైగా దర్శనం చేసుకున్నారని తెలిపారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చాలా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకుంటున్నారన్నారు. అదే సమయంలో విఐపి దర్శనాల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సమయంలో మాత్రమే ప్రముఖులు కూడా వస్తూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇదే రీతిన సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు.

**కలెక్టర్ విస్తృత తనిఖీలు...** జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీ షా సోమవారం తొలిరోజు వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు భక్తులకు చేసిన ఏర్పాట్లు ఎలా ఉన్నాయో వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. వినాయక టెంపుల్, విఎంసి పాయింట్, కేశఖండనశాల, సీతమ్మ వారి పాదాలు, పున్నమి ఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వైద్య శిబిరాలలో చేసిన ఏర్పాట్లు కూడా తనిఖీ చేశారు.



















# గుమ్మడిదుర్రులో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్





**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** సోమవారం గుమ్మడిదుర్రు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అసంక్రమిత వ్యాధులకోసం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం. దీనిలో భాగంగా హెల్త్ సెంటర్ శిబిరం వద్ద మండల వైద్య అధికారిని డా. నాగరాణి గారిచే వివిధ రకాలైనటువంటి వ్యాధులకు తగు వైద్యం అందించి ఉచిత మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన, ప్లాస్టిక్ నిషేధం గురించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో గుమ్మడిదుర్రు గ్రామ పిఏసిఎస్ ఛైర్మెన్ పొందూరు నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు పొందూరు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ నక్క.కమలమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పిఏసిఎస్ ప్రెసిడెంట్ పొందూరు నాగేశ్వరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం ఎప్పుడు వెనుకాడదని మరోసారి గుర్తు చేయటం జరిగినది. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ముందు ముందు రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేస్తూ ప్రజలకు సేవలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు సిహెచ్ఓ విరోనిలా, హెచ్వి నోబెల్ లలిత, పిహెచ్ఎన్ సత్యవతి, గుమ్మడిదుర్రు హెచ్డబ్ల్యూసి స్టాఫ్ సిహెచ్ ఓవైసుగుణ రాణి, ఏ.ఎన్.ఎం – కె అరుణ కుమారి, ఆశా వర్కర్స్ ఐనటువంటి జాన్ మేరీ, రమాదేవి, శోభారాణి, ఎం.విజయలక్ష్మి, అంగన్వాడి స్టాఫ్ పాల్గొనడం జరిగింది.

# ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత



**గన్నవరం, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్ :** పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం లోని పలువురు రోగులకు ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను, ఎల్ఓసి లను ఆదివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రోగుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామానికి చెందిన కంపసాటి తిమోతికి రూ. 1.50 లక్షలు, ఉంగుటూరు గ్రామానికి చెందిన కాజా సత్యనారాయణ కు రూ.1.75 లక్షలు ఎల్వసిలను, వీటితోపాటు బాపులపాడు మండలంలో ఐదుగురికి రూ.2.70 లక్షలు గన్నవరం మండలంలో ఆరుగురికి రూ. 3.06 లక్షలు ఉంగుటూరు మండలంలో ఆరుగురికి రూ.2.65 లక్షలు విజయవాడ రూరల్ మండలంలోని ఏడుగురికి రూ. 3.44 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను యార్లగడ్డ అందించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరి కి ఉచితంగా వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో రూ.25 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమల్లోకి వస్తే పేద మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందుతాయని భరోసా ఇచ్చారు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రతి ఒక్కరూ మద్దతు మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలందరూ తమ సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా ఆనందకుమార్, దయ్యాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉప రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**గన్నవరం, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్ :** జిల్లాలో భారత ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లు ఎలాంటి లోటు పాట్లు లేకుండా సమన్వయంతో పకడ్బందీగా చేయాలని సంపూర్ణ పర్యవేక్షణ అధికారి, సిఆర్ పి ఎఫ్ డిఐజి కమలేష్ సింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 24వ తేదీన నూతన గౌరవ ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ పర్యటన నేపథ్యంలో సోమవారం ఉదయం సిఆర్పిఎఫ్ డిఐజి కమలేష్ సింగ్ నేతృత్వంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, రాష్ట్ర ఇంటలిజెన్స్ భద్రత విభాగం డిఐ జి. హఫీజ్, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్ కె రెడ్డి లతో కలిసి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో సంబంధిత అధికారులతో ముందస్తు భద్రత ఏర్పాట్లపై ( ఏ ఎస్ ఎల్) సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు ఉపరాష్ట్రపతి రాకపోకలు, స్వాగత కార్యక్రమాలపై చర్చించి విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఉపరాష్ట్రపతి పర్యటించు మార్గాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సీఆర్పీఎఫ్ డీఐజీ కమలేష్ సింగ్ అధికారులకు సూచించారు.. రాష్ట్ర పోలీసు విభాగంతో పాటు కేంద్ర భద్రతా దళాలు సమన్వయంతో పని చేయాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లు కూడా సిద్ధంగా ఉంచాలన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఈ నెల 24వ తేదీన సాయంత్రం 4:20 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని, తదుపరి 5 గంటలకు విజయవాడకు చేరుకొని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటారని, అనంతరం 5:40 గంటలకు పున్నమి ఘాటును సందర్శించి 7:20 గంటలకు బయలుదేరి తిరుపతికి వెళతారన్నారు.. ఉపరాష్ట్రపతికి ఆహ్వానం పలుకు ప్రముఖుల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వారు వరుస క్రమంలో ఉండేలాగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉపరాష్ట్రపతికి పోలీసు గౌరవ వందనం పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు సురక్షిత ఆసుపత్రిగా పిన్నమనేని ఆసుపత్రిని, కంటిన్యూజెన్సీ ఆసుపత్రిగా గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిని సిద్ధంగా ఉంచాలన్నారు. ఉపరాష్ట్రపతి, వారి సతీమణి రక్తపు గ్రూపులను, అంబులెన్స్లను, కావలసిన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉప రాష్ట్రపతి, ప్రముఖులకు అందజేసే ఆహారాన్ని నిబంధన మేరకు పరీక్షించాలన్నారు. వాహన శ్రేణిలో ఉపయోగించే వాహనాల స్థితిగతులు



సరిగా ఉన్నాయా లేదా గమనించాలన్నారు. ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికే ప్రముఖులకు మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి తదితర ప్రముఖుల కోసం గ్రీన్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. పాములు పట్టే వారిని కూడా అందుబాటులో ఉంచి పాములు విమానాశ్రయం లోపలికి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. గన్నవరం విమానాశ్రయం నుండి విజయవాడ వరకు రహదారి మార్గంలో రాకపోకలకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఉపరాష్ట్రపతి ప్రయాణించు జాతీయ రహదారి మార్గంలో వీధి దీపాలు సరిగా వెలిగేలా చూడాలని, గుంతలు లేకుండా సరిచేయాలన్నారు. గన్నవరం విమానాశ్రయం చుట్టుపక్కల డ్రోన్లు ఎగరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు డ్యూటీ పాసులను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఎల్ అధికారి సిఆర్పిఎఫ్ కమాండెంట్ ధర్మ బీర్ జకర్, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ తేజ్ బహదూర్, డిపిఓ డాక్టర్ జే.అరుణ, డిఎస్ఓ మోహన్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం శివరాం ప్రసాద్, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ వెంకట్రావు, డిటిఓ శ్రీనివాస్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్ రావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, గన్నవరం ఎంపీడీవో స్వర్ణలత, తహసిల్దారు శివయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఖుషియా అన్‌లిమిటెడ్ ప్రచారంతో ఎస్‌బిఐ కార్డ్ పండుగ ఆఫర్ 2025 విడుదల

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద ప్యూర్-ప్లే క్రెడిట్ కార్డ్ జారీదారు, ఎస్‌బిఐ కార్డ్, 'ఖుషియా అన్‌లిమిటెడ్' ప్రచారంతో పండుగ సీజన్ 2025 కోసం దేశవ్యాప్తంగా విస్తృతమైన ఆఫర్ల అందిస్తోంది. వినియోగదారులు టైర్ 2, టైర్ 3 నగరాలలో సహా 2900 పైగా నగరాలలో ఆన్లైన్, ఆఫ్లైన్ ప్లాట్ఫార్మ్ పై 1250 పైగా వ్యాపారులచే నిధులు అందించబడే ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, తక్షణ డిస్కౌంట్ ఆఫర్ల నుండి ప్రయోజనం పొందవచ్చు. ఈ పండుగ ఆఫర్లు కన్స్యూమర్ డ్యూరబుల్స్, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, ఫ్యాషన్, ఫర్నీచర్, జువెల్లరీ, ఈ-కామర్స్, సరుకులతో కలుపుకొని అన్ని కీలక విభాగలపై వర్తిస్తాయి. పండుగ సంబరాలకు ఉత్సాహాన్ని అందించుటకు, ఎస్‌బిఐ కార్డ్, అమెజాన్, రిలయెన్స్ రీటెయిల్ గ్రూప్, మ్యాక్స్, రేమండ్స్, మాంటె కార్లో వంటి ప్రముఖ భాగస్వామ్య బ్రాండ్స్ లో కొనుగోళ్ళపై అద్భుతమైన డిస్కౌంట్లను అందిస్తోంది.

## ఎలిస్టా తయారీ కర్మాగారాన్ని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్





**విజయవాడ మేజర్ న్యూస్ :** టెక్నోడోమ్ గ్రూప్ కింద భారత దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్లలో ఒకటైన ఎలిస్టా కొత్త అత్యాధునిక తయారీ ప్లాంట్‌ను రాష్ట్ర పరిశ్రమల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ ప్లాంట్ కడపలోని ఈ ప్లాంట్ రూ. 250 కోట్ల దశలవారీ పెట్టుబడితో నిర్మించబడింది. ఇది భారతదేశ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ప్లాంట్ 1.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. దాని మొదటి దశలో ఇది సంవత్సరానికి ఒక మిలియన్ స్మార్ట్ టీవీలు, 1మిలియన్ ఎల్ఈడీ మానిటర్లను తయారు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2వ దశలో, ఎలిస్టా వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, స్మార్ట్ ఉపకరణాల తయారీతో కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తోంది. ఈ ప్లాంట్ దాదాపు 500 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఈ సందర్భంగా పరిశ్రమల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, "ఎలిస్టా కొత్త ప్లాంట్ సహాయంతో కడప ప్రపంచ స్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా మారుతుంది. ఇది 'మేక్ ఇన్ ఇండియా'కు మద్దతు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక వృద్ధి కోసం మా దార్శనికతకు ఇది అనుగుణంగా ఉంది. మన యువతకు ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రపంచ పటంలో రాష్ట్ర స్థానాన్ని బలోపేతం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిస్టా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.

## చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పాతదుస్తుల సేకరణ




**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఇంటిలో ఉపయోగించని పాత దుస్తులను సేకరించి నిరుపేదలకు పంపిణీ చేసేలా చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వాసవి హెల్పింగ్ హ్యాండ్స్ అనే కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. రామలింగయ్య పాఠశాల పక్కన వాసవీక్లబ్ కార్యాలయంలో ప్రతి రోజూ దుస్తుల సేకరణ చేసి వాటిని గ్రేడింగ్ చేసి రోడ్డువెంబడి నివసించే సంచార జాతులు, నిరుపేదలకు అందిం చనున్నారు. చల్లపల్లి పరిసర గ్రామాల్లోని వారెవరైనా ఇంటిలో వాడకుండా నిరుపయోగంగా ఉన్న చీరలు, డ్రస్లు, ప్యాంటు, షర్టులు తదితర దుస్తులను చల్లపల్లి వాసవీక్లబ్ కార్యాలయంలో అందించి పేదవారికి సహాయపడేలా తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకారం అందించాల్సిందిగా వాసవీక్లబ్ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, విజయకృష్ణదీపిక, వురిమి రమేష్, వరదా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు







## బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో శ్రీకొండలమ్మ అమ్మవారు

## కలశస్థాపన చేసిన విశిష్ట అతిథి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు

## భక్తులకు విస్తత ఏర్పాట్లు చేసిన చైర్మన్ ఈడే మోహన్, ఈఓ కొండలరావు


## ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించిన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

## రాష్ట్రం నలుమూలల నుండి విశేష సంఖ్యలో భక్తులు

**గుడ్లవల్లేరు సెప్టెంబరు 22 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసి యున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ది.22.09.2025 నుండి 02.10.2025 వరకు జరుగు శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవములలో భాగముగా సోమవారం ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భముగా శ్రీ కొండలమ్మ అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనము జరిగినది. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో తెలుగుదేశం పార్టీ నాయకులు జంగం మోహనరావు వెంటరాగా కలశ స్థాపన కార్యక్రమము జరిగినది. ఈ కార్యక్రమమునకు ఇతర కూటమి నాయకులు విచ్చేయగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ రావు, సభ్యులు తూము రాజ్యలక్ష్మీ, గుడ్లవల్లేటి వాణి, ముంగం ఆంజనేయులు, కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్ర బాబు, పెద్దిబోయిన శ్యామలా దేవి, నూతలపాటి లక్ష్మీ పావని, ఎక్స్- అఫీషియో మెంబర్ రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ శర్మ వారిని సాదరముగా ఆహ్వానించినారు. వీరి వెంట ఇతర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనినారు. అనంతరము పుణ్యాహవచన, పీఠార్చన, దీక్షాధారణ, సహస్ర నామార్చన, అగ్ని ప్రతిష్టాపన, శ్రీ లక్ష్మీ గణపతి సహిత నవగ్రహ హవనము జరిగినది. తొలుత సదరు నాయకులు శ్రీ అమ్మవారిని దర్శించుకొనగా వారిని దేవస్థానము కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు ఇతర సభ్యులు వారిని పుష్పమాలాంకృతులను చేసి, శ్రీ అమ్మవారి శేష వస్త్రములతో సత్కరించినారు. అనంతరము విచ్చేసిన అతిథులు, ఇతర కార్యకర్తలు అందరికి దేవస్థానము సిబ్బంది ప్రసాదములు అందజేసినారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవములు సందర్భంగా విచ్చేయు భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా దేవస్థానము పరిసర ప్రాంతములలో పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ చల్లించడ మైనది. పోలీస్ డిపార్ట్మెంట్ వారితో ఔట్ పోస్ట్, మెడికల్ %డ% హెల్త్ డిపార్ట్మెంట్ వారితో ఫ్రీ మెడికల్ క్యాంప్ లు ఎర్పాటు చేయటమైనది. మధ్యాహ్నం గం.1.00 లకు శ్రీ గీతా భక్త సమాజం, చింతలమాడ వారిచే, మధ్యాహ్నం గం.3.00 లకు శ్రీ వెంకటేశ్వర భజన సమాజం, భోగిరెడ్డిపల్లి వారిచే భజన కార్యక్రమములు, రాత్రి గం.7.30 ని.లకు శ్రీ బాలా త్రిపుర సుందరీ నృత్యనికేతన్, మచిలీపట్నం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి గం.8.30 ని.లకు షిరిడీ సాయి నాట్య మండలి వారిచే 2 రత్నములు గయోపాఖ్యానము, శ్రీ రామాంజనేయ యుద్ధం(వార్ సీను) ఘట్టాలు. రాత్రి గం.9.30 ని.లకు శ్రీ జై నాట్య మండలి, గుడివాడ వారిచే శ్రీ వల్లీ కళ్యాణము పౌరాణిక నాటకం ప్రదర్శనలు నిర్వహించారు.







## పలు సమస్యలపై ఎంపీ బాలశౌరిని కలిసిన రామలింగేశ్వరరావు



**పామర్రు మేజర్ న్యూస్ :** మండలంలో ఉన్న పలు ప్రజా సమస్యలపై మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ని కలిసి వినతిపత్రం అందించినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు తెలిపారు. ఎంపీ బాలశౌరి ని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం గతంలో ఆయన అందించిన నిధులతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను వివరించి, అనంతరం ప్రస్తుతం ఉన్న సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. మొవ్వ మండలంలో ఉన్న ప్రజా సమస్యలను వివరించడంతోపాటు పెదముత్తేవి గ్రామంలోని రోడ్ల సమస్యలపై వినతిపత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి చేయూతనందిస్తానని హామీ ఇచ్చారని మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూడా అయిన రామలింగేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని, పలు పాఠశాలలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాటికి సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయించాలని, అయ్యంకి నుండి కారకంపాడు మీదుగా కొండవరం అడ్డరోడ్డు వరకు గల జిల్లా పరిషత్ రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరడంతో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని ఎంపీ బాలశౌరి ని కోరినట్లు రామలింగేశ్వరరావు తెలిపారు.

# అర్జీదారులకు తక్షణ పరిష్కారం చూపాలి

### జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మీకోసం కార్యక్రమంలో అర్జీదారులు విన్నవించిన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని జిల్లా రెవిన్యూ అధికారి కె చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డిఓ కే స్వాతి, ఇంచార్జ్ హౌసింగ్ పిడి విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజుతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత సమయానికి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ కోర్సులను పూర్తి చేయడంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని, వాటిని తమ సిబ్బంది పూర్తిచేసే విధంగా ఆయా శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తూ, అవసరమైన వాటికి సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా కార్యాలయాలకు అవసరమైన గాజు సీసాలను సరఫరా చేసేందుకు గానూ వారికి ఎంత మోతాదులో ఇండెంట్ అవసరమో తెలియపరచాలని సూచించారు.కే ఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ అర్జీలు పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచిస్తూ, సంబంధిత అధికారులు తప్పనిసరిగా అర్జీదారునితో సానుకూలంగా మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

**అర్జీలలో కొన్ని...** వీఆర్వో సహకారంతో గ్రామంలోని ప్రభుత్వ స్థలమును ఒక కుటుంబం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుందని, దానిని తిరిగి స్వాధీనం తీసుకొని ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరుతూ బంటుమిల్లి మండలం, రామవరపుమోడి గ్రామపంచాయతీ శివారు పల్లికొండవారిమోడి గ్రామస్తులు అర్జీ సమర్పించారు.జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా భూ సేకరణ కింద తీసుకున్న తమ భూమికి ఇప్పటి వరకు నష్టపరిహారం అందించలేదని, తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ బాపులపాడు మండలం, కోడూరు పాడు గ్రామపంచాయతీ ఉమామహేశ్వం పురమునకు చెందిన సమ్మంగి వెంకట సత్యనారాయణ, సమ్మంగి జగన్నాథం, పూడి రంగారావు అర్జీ ఇచ్చారు.గతంలో తనకు 83 శాతంతో వికలాంగుల సదరం సర్టిఫికెట్ జారీ చేశారని, అయితే ఇటీవల వెరిఫికేషన్ పేరుతో క్యాంపు నిర్వహించి 47 శాతంతో వికలాంగుల సదరం సర్టిఫికెట్ జారీ చేశారని, పింఛను కోల్పోకుండా తనకు తగిన న్యాయం చేయాలని గుడ్లవల్లేరు మండలం, కౌతవరం గ్రామానికి చెందిన వి ఉమాదేవి విన్నవించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడలో లోక్‌సభ సభార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** లోక్ సభ సభార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సమావేశాలు విజయవాడలో సెప్టెంబర్ 23, 24 తేదిలలో జరగనున్నాయని కమిటీకి చైర్మన్ గా వ్యవహరిస్తున్న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా ఉన్న వివిధ రాష్ట్రాల లాలలోని సుమారు 12 మంది ఎంపీలు హాజరు కానున్నారని అయన తెలిపారు. సెప్టెంబర్ 23న ప్రముఖ బ్యాంకర్లు అయిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, బ్యాంకు అఫ్ ఇండియా, బ్యాంకు అఫ్ బరోడా, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకులకు సంబందించిన చైర్మన్ లు, మేనేజింగ్ డైరెక్టర్‌లు హాజరు కానున్నారని తెలిపారు. అదేవిధం గా ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థలు అయిన ఎన్ టీ పి సీ, ఆర్ ఈ సి, పీ ఎఫ్ సి సంస్థల సిఎండిలు కూడా ఈ సమావేశాలలో పాల్గొంటున్నారు అని తెలిపారు. సెప్టెంబర్ 24వ తేదిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, నేషనల్, ఇన్సూరెన్స్ కంపెని లిమిటెడ్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెని లిమిటెడ్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెని లిమిటెడ్. ది న్యూ ఇండియా అస్సురేన్స్ కంపెని లిమిటెడ్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అఫ్ ఇండియా, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్మెంట్ అథారిటీ అఫ్ ఇండియా మొదలైన వారితో సమావేశం జరుగుతుందని, ఇన్సూరెన్స్ సంబందించిన వివిధ అంశాలపై కూలంకషంగా చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశాలకు స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాసులు శెట్టితో సహా ప్రముఖ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్ లు హాజరవు తున్నారని,ఈ సమావేశాలలో బ్యాంకులకు సంబందించిన వివిధ విషయాలపై లోతైన చర్చలు, పరిష్కార మార్గాలు కోసం చర్చలు ఉంటాయని ఎంపి బాలశౌరి తెలిపారు.

# వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం

## అమ్మవారికి పూజలు చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ - పృథ్వీ కళ్యాణి దంపతులు







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక అజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీ పార్వతీ అమ్మవారి వద్ద జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ- పృథ్వీ కళ్యాణి దంపతులు, మామిడి మురళీకృష్ణ-జమురళీకృష్ణ-జయశ్రీ దంపతులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వద్ద తాడేపల్లి మెహర్ బాబా-శ్యామల దంపతులు, గుడివాడ మెహర్ ప్రసాద్-సుజాత దంపతులు కలశ స్థాపన చేశారు. తెల్లవారుజామున అమ్మవార్లకు సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చన, నగరేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. రాత్రి పార్వతీదేవిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కన్నుల పండుగగా అలంకరించారు. ఉదయం సహస్రనామ పారాయణ జరిగింది. సాయంత్రం పాదర్తి సిస్టర్స్ అభినయించిన కూచిపూడి నృత్యంశాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సామా వెంకట లక్ష్మి కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



# ఘనంగా శివకుమార్ పుట్టినరోజు వేడుకలు

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సజ్జా శివకుమార్ జన్మదిన వేడుకలు పెదపారుపూడి మండల పరిధిలోని దోసపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్, మొవ్వ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వర రావు, పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, కూచిపూడి వెంకట సుబ్బారావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై శివకుమార్ తో కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎపిస్టెమికాన్ - 2025లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు



**గుడ్లవల్లేరు సెప్టెంబరు 22 మేజర్ న్యూస్ :** ఆంధ్ర లయోల కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయవాడ ఈ నెల 20 తేదీన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ ఎపిస్టెమికాన్ – 2025 ను ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్థులకు నిర్వహించారు. అందులో గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఫెస్ట్‌లో ప్రదర్శించిన ప్రతి అంశంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఇందులో భాగంగా పేపర్ ప్రజెంటేషన్‌లో మెకానికల్ విద్యార్థులైనా బి.ఆర్.వల్లభ రెడ్డి, వి.రుత్విక్‌లకు మొదటి బహుమతి, ఈ.సి.ఈ, సి.ఐ.ఓ.టి విద్యార్థులైనా ఐ.శివ కిషోర్, టి.ఎస్.ఎస్.సాయిలకు తృతీయ బహుమతులు లభించాయి. పోస్టర్ ప్రజెంటేషన్‌లో మెకానికల్ విద్యార్థులు కె.కె.ఈశ్వర్, ఎన్.హిమ వరుణ్‌లకు ప్రథమ, పి.పి.శ్రీధర్, జి.అభిరాంలకు ద్వితీయ, బి.నాగ గౌతమ్, సి.హెచ్.కుమార్ సాయి లకు తృతీయ, కంప్యూటర్ విద్యార్థులు ఎ.హేమ ప్రియ, సి.హెచ్.నేహా జాలాని లకు ద్వితీయ బహుమతులు లభించాయి. టెక్నికల్ క్విజ్‌లో మెకానికల్ విద్యార్థులు బి.ఆర్.వల్లభ రెడ్డి, వి.రుత్విక్ లకు ప్రథమ, ఎ.ఎన్.భరత్, సి.హెచ్.రాజేష్‌లకు తృతీయ బహుమతులు లభించాయి. అదేవిధంగా వివిధ ప్రాజెక్ట్ అంశాలలో మెకానికల్ విద్యార్థులు ఎ.ఎన్.భరత్, సి.హెచ్.రాజేష్ లకు ద్వితీయ, ఈ.సి.ఈ విద్యార్థులు జి.బి.ఎన్.మణికంఠ, డి.వి.సిద్దార్థ లకు తృతీయ బహుమతులు లభించాయని, ఈ విద్యార్థులందరూ కూడా ఇంజనీరింగ్ విద్యార్థులతో పోటీపడి బహుమతులు కైవసం చేసుకోవడం విశేషమని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు అత్యుత్తమ స్థానాలకు చేరాలంటే ఇటువంటి జాతీయ స్థాయి ఉత్సవాలలో పాల్గొని వారి యొక్క మేధా శక్తిని పెంపొందించుకోవాలన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను, వారికీ ప్రత్యేక శిక్షణను అందించిన ఇ.సి.ఇ, మెకానికల్, కంప్యూటర్, సి.ఐ.ఓ.టి బ్రాంచ్ విభాగాధిపతులను, అధ్యాపకులను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరుపల్లి, సెక్రటరీ, కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో సెక్రెటరీ, కరస్పాండెంట్ రామకృష్ణ వల్లూరుపల్లి, ఎక్సుక్యూటివ్ మెంటర్ ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, అకడమిక్ కో-ఆర్డినేటర్ జి.వి.వి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రాజశేఖర్ అభినందించారు.

# గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తాడిగడపలోగల ఎల్ వి ప్రసాద్ కంటి హాస్పిటల్ కు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేసారు.

# కేంద్రం జీఎస్టీ తగ్గింపు పేద మధ్యతరగతికి ఊరడింపు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దేశవ్యాప్తంగా జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో లాభం చేకూరుతుందని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు.జీఎస్టీ పేరుతో పేదవాడి కి ఆహారాన్ని ఇచ్చే వస్తువులపై విపరీతంగా ధరలు పెంచడం మధ్యతరగతి కుటుంబీకులు కోరుకునే చిన్న వాహనాలపై రేట్లు పెంచడం జరిగిందని, ఈరోజు ఈ నిర్ణయం వల్ల తగ్గింపులు రావడం ఎంత వెసులుబాటు, కేంద్ర ప్రభుత్వంపై నమ్మకాన్ని కలగజేస్తుందని బాలాజీ అన్నారు. జిఎస్టి రేటు తగ్గించిన తరిమిలా ఆ వస్తువులపై తగ్గింపు రేటుతో అమ్మే విధంగా జిఎస్టి అధికారులు తక్షణమే తగిన పర్యవేక్షణ జరపాలని బాలాజీ అన్నారు.గృహ నిర్మాణాలకు ఉపయోగించే సిమెంటు ఇసుక ఐరన్ పై కూడా జిఎస్టి తగ్గించడం వలన పేదవాడి ఇంటి కలలు నెరవేరుతాయని బాలాజీ అన్నారు. పలు వ్యాపార సంస్థలు జీఎస్టీ పేరుతో డబ్బులు వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయకుండా ఉండటం జరుగుతుందని అటువంటి వారిని కఠినంగా శిక్షించాలని బాలాజీ అన్నారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన మరింత పెంచే విధంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు ఇవ్వాలని బాలాజీ సూచించారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహన



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో "స్వస్త నారీ సశక్త్ పరివార్ అభియాన్"లో భాగంగా 2025 సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు గాంధీ జయంతి వరకు జరిగే పోషణ్, మిషన్ శక్తి వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ఆధారంగా మచిలీపట్నంలోని గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. మహిళలకు సాధికారత కల్పించడం, కుటుంబ ఆరోగ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈరోజు వెల్ నెస్ క్లినిక్, ఎమ్ సిహెచ్ బ్లాక్, జిటిజిహెచ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఆశలత, ఓబీజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రోజాతో కలిసి ఈ ప్రచారానికి నోడల్ అధికారిగా ప్రారంభించారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక సదుపాయాలు :



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మహిళల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వస్త్ నారి - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అఖిల సూచించారు. పమిడిముక్కల మండల పరిధిలోని అలీనఖిపాలెం లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు ముందుండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల పథకాలను ప్రవేశపెట్టాయని, అలాగే ఆరోగ్యపరంగా కూడా మహిళలకు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యపరంగా సమస్యలు రాకుండా ఉండేందుకు పోషక విలువ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఎన్ఎం విన్నకోట వసంత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సలీమున్నీసా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సాగులో రసాయనేతర పద్ధతులు అవలంబించండి





**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** రైతులు పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నారని, సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని రైతులకు ఆయన సూచించారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వీరంకిలాకు రైతు సేవ కేంద్రం ప్రాంగణంలో ఇఫ్ కో కంపెనీ సహకారంతో ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు సోమవారం అవగాహన, చర్చాగోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కె.వి.కె.సమన్వయ కర్త డా. సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుత వరి సాగులో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, చేపట్టాల్సిన మెళకువలను గుర్చి రైతులకు వివరించారు. ఇఫ్ కో తరఫున రైతులకు నానో యూరియా, నానో డిఏపీ పైన వాటి పని తీరు, వినియోగించే విధానం, డ్రోన్ పిచికారీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం వరి పొలాలను క్షేత్ర సందర్శన చేసి ఆకుముడత పురుగు యాజమాన్యం కొరకు ఎసిఫేట్ 300 గ్రాములు, లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మిల్లీ లీటర్ల వంతున ఎకరానికి, పొడ తెగులు యాజమాన్యం కొరకు హెక్సాకొనజోల్ 400 మిల్లీ లీటర్లు వంతున ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, రేవతి, ఇఫ్ కో మేనేజర్ నంద కిషోర్, పమిడిముక్కల మండల వ్యవసాయాధికారి గణేష్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవ కమిటీ సభ్యుడుగా సీనియర్ జర్నలిస్టు అట్లూరి



**గన్నవరం, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్ :** విజయవాడ కనకదుర్గ గుడి దసరా ఉత్సవాల సేవా కమిటీ సభ్యులుగా సీనియర్ జర్నలిస్ట్ అట్లూరి రాజశేఖర్ నియమితులయ్యారు. దసరా ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక సేవ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అదేవిధంగా ఉత్సవాలకు సేవా కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ ఏడాది ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 96 మందితో ఉత్సవ కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కమిటీలో బాపులపాడు కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ అట్లూరి రాజశేఖర్ ను సభ్యులుగా నియమించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్ను ఈ కమిటీకి యార్లగడ్డ సిఫారసు చేశారు. ఉత్సవకమిటీ లో తనను నియమించిన యార్లగడ్డకు ఈ సందర్భంగా రాజ శేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## వాసవీమాతకు పల్లకీసేవ, నగర సంకీర్తన



**చల్లపల్లి, మేజర్ న్యూస్:** చల్లపల్లిలోని శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళ్యాణమండపం అధ్యక్షుడు కొల్లిపర నాగ పోతురాజు(మధు) జెండాప్రతిష్టచేశారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, పురోహితులు లం కా చక్రపాణిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, విశేష హోమమ ఎలు జరిపారు. శ్రీవాసవీ భక్తబృందం వారిచే గీతాపారాయణం, శ్రీలలిత విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. శ్రీఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఉదయం నగర సంకీర్తన, పల్లకీసేవలు నిర్వహిం చారు. పొట్టిశ్రీరాములు వీధిలోని శ్రీఆర్యవైశ్య సంఘ భవనం నుంచీ బయలుదేరి తీన్మార్ డప్పులతో పెదకళ్లేపల్లి రోడ్డులోని అమ్మవారి ఆలయం వరకు శ్రీవాసవీమాత పల్లకీసేవ జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అన్నవరపు పాండురంగారావు, తమ్మన సతీష్కుమార్ వరదా రాజశేఖర్, కొల్లిపర నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## హోమియో రంగంలో కొత్త వరవడికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు సోహాన్ సింగ్



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** సి ఆర్ వికాస కేంద్రం ట్రస్ట్ సభ్యులు అద్దాడ ప్రసాద్ బాబు హోమియో రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన మహానుభావుడు డాక్టర్ సోహాన్ సింగ్ అని శ్రీ చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రం ట్రస్ట్ డైరెక్టర్ అద్దాడ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ప్రముఖ హోమియో రంగ నిపుణులు డాక్టర్ సోహాన్ సింగ్ ద్వితీయ వర్ధంతి సి ఆర్ వికాస కేంద్రంలో హోమియో క్యాంపులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు అద్దాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ అనేకమంది పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవ అందించారని కొనియాడారు. సోహాన్ సింగ్ నేషనల్ హోమియోపతి కౌన్సిల్ మెంబర్గా పని చేశారని గుర్తు చేశారు. అనేక ఉచిత హోమియో క్యాంపులకు ఆయన వెన్నుదన్నుగా నిలిచారన్నారు. అలాంటి మహానుభావుని స్మరించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సిద్దాబత్తుల వాసు, హర్ష, కొండలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఏకగ్రీవం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ నిర్వహణ ప్రఖండ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సోమవారం ప్రారంభించిన ఉత్సవాలను పరిష్కరించుకొని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ ఆదేశాల మేరకు జిల్లా మఠ మందిర్ సహ ప్రముఖ్ అన్నవరెడ్డి కృష్ణ చల్లపల్లి ప్రకండ అధ్యక్షులు అడపా రవి అధ్యక్షతన ఉత్సవ నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అర్ధ ఏడుకొండలు సుధాని సత్యనారాయణలు కొల్లిపర సుధాకర్ కొమ్ము ప్రతాప్ ఎర్రం శెట్టి శాంతారావు గరికిపాటి వీరాంజనేయులు తోడేటి గణపతి కొక్కిలిగడ్డ ఎలమంద ప్రసాద్ కుంభా కోటయ్యలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు ప్రఖండలోని ప్రతి ఖండ ఉత్సవ కమిటీలు విధిగా వేసుకొని దేవీ నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించాలని ఆయన సూచించారు.



## తాళం భజన మురళీ కోలాటం సంస్కృతికి నిదర్శనం



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** తాళం భజన మురళీ కోలాటం సంస్కృతికి నిదర్శనం అని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నా రు. ఘంటసాల మండలం చిట్టూర్పులోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో "6వ కృష్ణా, ఎన్టీఆర్, ఏలూ రు జిల్లాల స్థాయి తాళం భజన మురళీ కోలాటం పోటీలు" పీఏసీఎస్ అధ్యక్షు లు గుత్తికొండ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు అతిథులుగా విచ్చేసి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు చాటి చెప్పే విధంగా పోటీలు నిర్వహిస్తున్న గుత్తికొండ వరప్రసాద్ అభినందనీయులని తెలిపారు. అనంతరం శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామివా ర్లను వెంకట్రామ్, శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్, టీడీపీ మండల అధ్యక్షులు, ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, రంగస్థల కళాకారుడు బోలెం రామారావు, దిరిశం బాలకోటయ్య, మేడికొండ విజయ్, నిర్వాహకులు, భక్త సమాజం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** పెదపారుపూడి మండల పరిధిలోని గ్రామాలలో సోమవారం శ్రీ దేవి శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మనం అన్ని గ్రామాల్లో దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించగా భక్తులు ప్రజాసంఖ్యలో పాల్గొని క్షేత్ర ప్రసాదాలు స్వీకరించారు. వెంట్రప్రగడ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో అమ్మవారు మొదటి రోజు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

## పోషక విలువల ఆహారాన్ని పిల్లలకు అందించాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్:** బలవర్ధకమైన ఆహారం అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సర్పంచ్ వల్లూరు ఉమ ఉన్నారు. మండల పరిధిలోని వక్కలగడ్డ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన సుపోషిత్ భారత్-సశక్త్ భారత్ కార్యక్రమంలో సర్పంచ్ ఉమ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారాన్ని పోషక విలువలు పోకుండా పిల్లలకు ఎలా అందించాలనేదానిపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్ని ప్రతిరోజూ పరిశుభ్రంగా అంగన్వాడీకి పంపేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. పిల్లల్ని క్రమం తప్పకుండా అంగన్వాడీలకు పంపి అక్కడ ఇచ్చే ఆహారాన్ని పిల్లలకు అందించాలని పేర్కొన్నారు. అలాగే బాలింతలు, గర్భిణీ స్త్రీలు కూడా బలమైన ఆహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యవంతంగా తాయరవుతారని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ విశ్రాంతమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి వేమూరి లావణ్య, అంగన్వాడీ టీచర్లు దుర్గారాణి, నిర్మల, లక్ష్మీ, నాగలక్ష్మి, తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరత లేదు

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.



**గన్నవరం, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్ :** రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారం రోజులలో కావలసిన యూరియా బ్యాగులను సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ గన్నవరం మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలోని ఇఫ్కో యూరియా గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో సమావేశమై వారి సమస్యలు వినిపించారు. రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు వరి పంటకు రెండు సార్లు యూరియా వేశారు. మూడో దోసు అవసరమైనదిగా పేర్కొన్నారు. దసరా పండుగ తర్వాత యూరియా అందితే ఆలస్యం అవుతుందని తెలిపారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి ప్యాక్స్ గుమాస్తా అనుషా ను వివరాలు అడిగారు. ఆమె సెప్టెంబర్ 16న 15 టన్నుల యూరియా వచ్చినట్లు తెలియజేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించిన కలెక్టర్, వారంలోపల యూరియా ఖచ్చితంగా అందుబాటులోకి వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు, అని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గన్నవరం తహసీల్దారు శివయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన దేవీ నవరాత్రుల మహోత్సవాలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దేవీ నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి దసరా మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు అమ్మవార్లు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. శ్రీ రాజరాజేశ్వరి సహిత రాజశేఖర్ స్వామి దేవస్థానంలో అమ్మవారికి దసరా మహోత్సవాలు పురస్కరించుకొని పూజలు నిర్వహించేందుకు పది రోజుల పాటు వివిధ అలంకారాలు నిర్వహిస్తున్నారు మండల పరిధిలోని పులిగడ్డలో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం అవనిగడ్డ ఐదో వార్డులో వేంచేసి ఉన్న గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి ఆలయం కంచి కామాక్షమ్మ అమ్మవారి ఆలయం 9వ వార్డులోని కనకదుర్గ అమ్మవారి ఆలయం 3వ వార్డులోని శ్రీ కోదండ రామాలయం లో ఏర్పాటుచేసిన అమ్మవారిని మండల పరిధిలోని వేకనూరు లో ఉభయ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలో పార్వతీ అమ్మవారిని మాదివాడ వారి కులదైవం అయిన అంకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉదయం 7. 30 నిమిషాలకు అమ్మవారి కలిశ స్థాపన చేసి బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు భక్తులు భారీగా తరలివచ్చి లలిత సహస్రనామ పారాయణం విశేష కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు అదేవిధంగా నాగాయలంక కోడూరు మండలంలోని అమ్మవారి ఆలయాలలో మొదటిరోజు పూజలు వైభవంగా జరిగాయి గీతా మందిరంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేషాలు అభిషేకాలు నిర్వహించడంతో ఎర్రం శెట్టి శ్రీహరి బాబు అరుణ దంపతులు మహోత్సవాలను ప్రారంభించారు అర్చక స్వామి దీవి నరసింహమూర్తి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. 3వ వార్డులను శ్రీ కోదండ రామాలయంలో అందే వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి దంపతులు కలిశ స్థాపన చేసి బాలా త్రిపుర సుందరి దేవి గా అలంకారం చేసి ఆలయ పూజారి మల్లికార్జునరావు చే పూజా కార్యక్రమం అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు.

# అధికారుల నిరంతర పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అధికారుల నిరంతర పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారము ఉదయం తన పర్యటనలో భాగంగా వి నాయకుని గుడి, కెనాల్ రోడ్, కృష్ణవేణి ఘాట్, భవాని ఘాట్, పున్నమి ఘాట్, అమరావతి స్టాక్ పాయింట్, క్యూలైన్లో, వాటర్ పాయింట్లు, మరుగుదొడ్ల పాయింట్లు, కేశఖండనశాల, ప్రాంతాలన్నీ పర్యటించే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది మొత్తం సమయ పాలన కచ్చితంగా పాటించాలని, ప్రతి షిఫ్ట్ లో సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని, ప్రతి వాటర్ పాయింట్ వద్ద త్రాగునీరును అధికారులు పర్యవేక్షిస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి గంట గంటకు రిపోర్ట్ తీసుకుంటూ త్రాగునీటి కొరత లేకుండా చూసుకోవాలని, పారిశుధ్య నిర్వహణలో డ్రోన్లను వాడుతూ పారిశుధ్యంలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, మరుగుదొడ్లు పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, బయట డ్రమ్ములో ఎల్లప్పుడూ మీరు అందుబాటులో ఉండాలని, ప్రతి మరుగుదొడ్డిలో అవసరమైన వస్తువులు కచ్చితంగా ఉండేటట్టు చూసుకోవాలని, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలా త్రిపుర సుందరి దేవిని దర్శించుకున్న ప్రముఖులు

**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రులలో మొదటి రోజైన సోమవారం బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరి తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... అమ్మవారి దర్శనం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అరాచక శక్తుల నుంచి కాపాడాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఉపరాష్ట్రపతికి వేద పండితులు ఆశీర్వచనం అందించగా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ మాజీ రాష్ట్రపతికి, ఎమ్మెల్యేలకు అమ్మ వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

**అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

శ్రీ విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలు సందర్భంగా తొలిరోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సోమవారం శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకృత అమ్మవారిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ అందరికి దసరా శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆధ్యాత్మికత వాతావరణంలో దర్శించుకుంటున్నారని తెలిపారు. పటిష్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెళ్తున్నారని తెలిపారు. క్యూలైన్లు అన్ని సజావుగా సాగుతున్నాయని.. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రోటోకాల్ దర్శనాలకు ప్రత్యేకంగా స్లాట్లు కేటాయించినట్లు తెలిపారు దాదాపు 4,000 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారని.. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమిష్టి సహకారంతో రాష్ట్ర పండుగను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రత్యేక అధికారులు కూడా ప్రతి సెక్టార్ లోను విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చిన్నచిన్న లోపాలు ఏవైనా ఉంటే వాటిని సరిదిద్దుకొని ముందుకు వెళ్తున్నట్లు మంత్రివర్యులు వివరించారు.

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ**

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా తొలి రోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ తన బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మణిశర్మ మాట్లాడుతూ... అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం మంచి ఏర్పాట్లు చేసిందని కితాబిచ్చారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.


## నేటి చంద్రబాబు ఆలోచనే, రేపటి దేశం ఆచరణ

**అసెంబ్లీలో వర్ల కుమార్ రాజా**



**పామర్రు మేజర్ న్యూస్ :** శాసనసభలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేసిన ప్రసంగంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతను బలంగా వినిపించారు. దేశవ్యాప్తంగా జరిగిన జాతీయ సదస్సులో ఏపీ ఎస్సీ సంక్షేమ పథకాలు అందరి ప్రశంసలు అందుకున్నాయని, దీనికి చంద్రబాబు ముందుచూపే కారణమని అన్నారు. నేడు సీబీఎన్ ఏమనుకుంటారో, రేపు భారతదేశం అదే అనుసరిస్తుంది అని ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మీ ఆంధ్రప్రదేశ్‌లో కోహినూర్ వజ్రం ఉందా? లేదా కేజీఎఫ్ గనులు ఏమైనా ఉన్నాయా? అని జాతీయ సదస్సులో ఇతర రాష్ట్రాల నేతలు తనను అడిగారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అసెంబ్లీలో తెలిపారు. ఇన్ని సంక్షేమ పథకాలకు నిధులు ఎలా సమకూరుస్తున్నారని వారు ఆశ్చర్యపోయారని అన్నారు. మా అసలైన పెట్టుబడి చంద్రబాబు నాయుడు మేధస్సు, ఆయన విజన్ అని తాను గర్వంగా సమాధానం ఇచ్చానని సభకు వివరించారు.

## స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావుకు ఆర్యవైశ్య సంఘం ఘన నివాళి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ అభివృద్ధి ప్రదాతగా తెలుగు జాతి ముద్దుబిడ్డగా స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు విశిష్ట ఖ్యాతి పొందారని నియోజకవర్గ టీడీపీ వాణిజ్య కమిటీ అధ్యక్షులు ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య) అన్నారు. స్థానిక వంతెన సెంటర్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అవనిగడ్డ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అవనిగడ్డ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నంబూరు వెంకటేశ్వరరావు, వాసవి అమ్మవారి ఆలయ నిర్మాణ అధ్యక్షులు అద్దేపల్లి నాంచారయ్య, ప్రధాన కార్యదర్శి వేముల నాంచారయ్య, కోశాధికారి నంబూరి సుబ్రహ్మణ్యం, అవనిగడ్డ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కూరపాటి వేణుగోపాలరావు, అవనిగడ్డ అరవింద్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు దేసు జగన్మోహనరావు, మానేపల్లి వేణు, మానేపల్లి భగవాన్, చెన్నగిరి అయ్యప్ప, ఘంటసాల ప్రసాద్, వేముల వెంకటేశ్వరరావు వేముల నాగేశ్వరరావు, చిట్టా ప్రసాద్ కిరాణా షాపు కోడూరు సంపూర్ణ మల్లేశ్వరరావు, మానేపల్లి పువ్వాడ అశోక్, మానేపల్లి సునీల్, కోడూరు శ్రీనివాసరావు, పెదమల్లు భాస్కరరావు, మానేపల్లి పిచ్చేశ్వరరావు, కొనకళ్ల రామమోహనరావు, గుగ్గిలం శ్యాంకుమార్, వేముల నాంచారయ్య, అద్దేపల్లి ప్రసాద్, ఆర్యవైశ్య సోదరులు పుష్పాంజలి ఘటించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## టెర్రస్ గార్డెనింగ్ పై విస్తృతమైన అవగాహన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాల మేరకు "స్వచ్ఛోత్సవ్- స్వచత హి సేవ 2025" ఇంటిపైన కూరగాయలు పండించే విధంగా అవగాహన కల్పించే కార్యక్రమం విస్తృతంగా చేపట్టింది. అందులో భాగంగా భారతి నగర్ గురునానక్ కాలనీ చెట్టు నగర్ లో మిద్దపైన రకరకాల కూరగాయలను పండిస్తున్న వారితో అవగాహన కల్పించారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ సౌజన్యంతో విజయవాడ నగరపాలక సంస్థ ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా భారతి నగర్ లో బి నాగలక్ష్మి, గురునానక్ కాలనీ లొ యం. ఈశ్వరమ్మ,యు. ఉమా, చిట్టినగర్ లో యం.కమలాకర్ వారు మిద్దె పైన తోటను ఎలా పండిస్తున్నారు, ఎంత చిన్న చోటు ఉన్నప్పటికీ ఎంత ఎక్కువ మొక్కలను పెట్టొచ్చు, వాటి ద్వారా వచ్చే వ్యర్థాలతో సొంతంగా ఇంటిలోనే ఎరువులు ఎలా తయారు చేసుకోవాలి వంటి అంశాలపై ప్రజలకు విజయవాడ నగరపాలక సంస్థ వారి సామాజిక మాధ్యమాలలో వీడియోను ప్రచురితం చేసి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పైనే కూరగాయలు పండించడం వల్ల ఆరోగ్యకరమైన కూరగాయలను ఆకుకూరలను తినవచ్చని, పర్యావరణ పరిరక్షణ చేయొవచ్చని, వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చని వారు తెలిపారు.



### గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

నగరాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే

# “విజయవాడ ఉత్సవ్” లక్ష్యం..





**విజయవాడ, మేజర్ న్యూస్ :** నగరాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే “విజయవాడ ఉత్సవ్” లక్ష్యం.. అని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కూటమి నాయకులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గొల్లపూడి ఎగ్జిబిషన్ వినోదానికి మాత్రమే కాకుండా, విజ్ఞానానికి కూడా వేదికగా మారనుందని, పిల్లలు, యువత, కుటుంబ సభ్యులు అందరూ ఆనందించగల సమగ్ర వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సాంస్కృతిక, శాస్త్రీయ, విద్యా ప్రదర్శనలతో పాటు, స్థానిక కళాకారులు, వ్యాపారవేత్తలకు తమ ప్రతిభను, ఉత్పత్తులను ప్రదర్శించే ప్రత్యేక వేదిక లభిస్తుందని అన్నారు. విజయవాడ ఉత్సవ్ లక్ష్యం నగరాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లడమేనని, ఆ దిశగా గొల్లపూడి ఎగ్జిబిషన్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎగ్జిబిషన్‌లో వినోద పార్క్, హ్యాండిక్రాఫ్ట్స్, ఫుడ్ స్టాళ్లు, టెక్నాలజీ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శనలు వంటి అనేక ఆకర్షణలు ఏర్పాటు చేశామని తెలిపారు. దసరా ఉత్సవాల సందడి నడుమ విజయవాడ ప్రజలకు ఇది ఒక విభిన్నమైన అనుభూతిని అందిస్తుందని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ ను ప్రతిబింబించేలా గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రత్యేకంగా నిలుస్తుందని, అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా వైవిధ్యభరితమైన అంశాలు సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గొల్లపూడి ఎగ్జిబిషన్‌కు ప్రజలందరినీ ఆహ్వానించిన ఆయన విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గొల్లపూడి పార్టీ అధ్యక్షుడు నూతలపాటి నారద, మైలవరం బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వర రావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వర రావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్రా వాసు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు గూడపాటి పద్మశేఖర్, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్లమూడి చలపతిరావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



**గన్నవరం, సెప్టెంబర్ 22, మేజర్ న్యూస్ :** గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీలో కోరారు. శాసనసభ వర్షా కాల సమావేశంలో భాగంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన యార్లగడ్డ విమానాశ్రయ విస్తరణ కోసం 2015 వ సంవత్సరం గన్నవరం మండలంలోని దావాజీగూడెం, బుద్దవరం, అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో 835 ఎకరాల భూమిని సేకరించారని భూములు ఇచ్చిన రైతుల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విన్నవించారు. విమానాశ్రయ విస్తరణలో 423 మంది ఇళ్ళు కోల్పోగా వారిలో 300 మంది పేద ఎస్సీలు ఉన్నారని తెలిపారు. ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కోసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఒక్కొక్కరికి ఐదు సెంట్లు భూమిలో ఇళ్ళు నిర్మించి ఇచ్చేందుకు కాలనీ ఏర్పాటు చేశారని, ఈ కాలనీలో కనీస వసతులు లేవని, ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు రూ.80 కోట్లు కేటాయించాలని కోరారు. అదే విధంగా ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు ఒక్కొక్కరికి తొమ్మిది లక్షలు పరిహారంగా ఇవ్వాల్సి ఉందని ఇందు నిమిత్తం రూ.59 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దావాజీగూడెంలో మైక్రో కాల్వ నిర్మాణం కోసం 45 ఇళ్ళు తొలగించారని, నిర్వాసితులకు రూ.50 వేలు చొప్పున అద్దె ఇవ్వాల్సి ఉందన్నారు. విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు రూ.27 కోట్లు కౌలు బకాయిలు విడుదల చేయాలని యార్లగడ్డ కోరారు. రూ.459 కోట్లతో చేపట్టిన విమానాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. విమానాశ్రయ విస్తరణ కోసం సీతారామచంద్రస్వామి ఆలయం, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల భూములు 4.30 ఎకరాలు సేకరించారని ఆ భూములకు రాజధానిలో భూముల కేటాయించాలని అసెంబ్లీలో యార్లగడ్డ కోరారు.



### దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వుండాలి

**అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి కేశినేని జానకిలక్ష్మి, కుమారుడు వెంకట్**

**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని బాలా త్రిపుర సందరి దేవి అలంకారంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకిలక్ష్మి, తనయుడు వెంకట్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కుటుంబ సభ్యులు అమ్మవారి కటాక్షం, ఆశీర్వాదం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలపై ఉండాలని ప్రార్థించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మి, కుమారుడు వెంకట్ కు ఆలయ అధికారులు, అర్చకులుస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో తీర్థప్రసాదాలు అందుకున్నారు. దసరా శరన్నవరాత్రులకు మరింత శోభ తెచ్చే విధంగా విజయవాడలో జరుగుతున్న “విజయవాడ ఉత్సవ్” విజయవంతం కావాలని, నగర ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు జానకి లక్ష్మి, వెంకట్ తెలిపారు. అలాగే ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం తమకు ఒక అదృష్టమని ఎంపీ కుటుంబ సభ్యులు అభిప్రాయపడ్డారు.

## విజయవాడ ఉత్సవ్‌కి గవర్నర్‌ను ఆహ్వానించిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ మేజర్ న్యూస్ :** సూర్యారావుపేటలోని రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. “విజయవాడ ఉత్సవ్” కు హాజరు కావాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఎంపీ కేశినేని శివనాథ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. విజయవాడను భవిష్యత్తులో గ్లోబల్ కల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దడమే ఈ ఉత్సవం ప్రధాన లక్ష్యమని గవర్నర్‌కి ఎంపీ వివరించారు. నగరంలో నాలుగు ప్రధాన వేదికలపై ఆధ్యాత్మిక వాతావరణం, సంప్రదాయ కళలు, ఆధునిక సంగీతం, వినోదం కలయికతో భక్తులు, నగరవాసులు, దేశ విదేశాల నుండి వచ్చే సందర్శకులకు అద్భుత అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేసినట్లు ఎంపీ తెలిపారు. విజయవాడ ఉత్సవ్ కేవలం పండగ ఉత్సవం మాత్రమే కాదు. ఇది నగరానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టే సాంస్కృతిక వేదికగా నిలుస్తుంది. ప్రతి ఏడాది మరింత వైభవంగా కొనసాగిస్తూ నగరాభివృద్ధికి కొత్త మార్గాలు సృష్టిస్తాం,” అని గవర్నర్ వద్ద ఎంపీ శివనాథ్ స్పష్టం చేశారు. ప్రపంచం నలుమూలల నుండి పర్యాటకులు, కళాకారులు, ఆధ్యాత్మిక విశిష్టులు పాల్గొనే గ్లోబల్ కల్చరల్ హబ్‌గా విజయవాడను తీర్చిదిద్దడమే ఈ మహోత్సవం వెనుక ఉన్న అసలు దృక్పథమని ఆయన గవర్నర్ కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్.. ఎంపీ కేశినేని శివనాథ్ ముందు చూపు కలిగిన సదుద్దేశాన్ని అభినందిస్తూ, విజయవాడ ఉత్సవ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ సభ్యుడు ముత్తవరపు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**విజయవాడ ఉత్సవ్ కి హాజరు కానున్న గవర్నర్ ఎస్.నజీర్**

మంగళవారం సాయంత్రం 6 గంటలకు పున్నమి ఘాట్ కు హాజరు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో “సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ” సారథ్యంలో వరల్డ్స్ బిగ్గెస్ట్ ఫెస్టీవ్ కార్నివల్ “విజయవాడ ఉత్సవ్” 2వ రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జనాబ్ యస్. నజీర్ విచ్చేయుచున్నారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 23వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు పున్నమి ఘాట్ వద్ద జరిగే విజయవాడ ఉత్సవ్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని ప్రకటించారు. సోమవారం రాజ్ భవన్ కు విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యులు ముత్తవరపు మురళీ కృష్ణతో కలిసి స్వయంగా గవర్నర్ ఎస్.నజీర్ ను ఆహ్వానించటం జరిగిందని పేర్కొన్నారు. నగరానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న విజయవాడ ఉత్సవ్ కి విచ్చేస్తున్న గవర్నర్ నజీర్ ఎంపీ కేశినేని శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999